
కళ్యాణ తిలకం
(కాళికాలయం 3వ భాగం)
MB
మధుబాబు

# కళ్యాణ తిలకం

( కాళికాలయం 3వ భాగం)

# కళ్యాణ తిలకం

(సస్పెన్స్, మిస్టరీ థ్రిల్లర్)

## కాళికాలయం

## ( ఆఖరి భాగం)

రచన:

## మధుబాబు

మధుబాబు పబ్లికేషన్స్

మాచవరం,

విజయవాడ-520 004

# KALYANA TILAKAM

## PART-3

By
MADHU BAABU

ద్వితీయ ముద్రణ: 2 0 0 8

ఇందులోని పాత్రలు, ప్రదేశాలు, సన్నివేశాలు, సంఘటనలు కేవలం కల్పితాలు . ఎవరినీ ఉద్దేశించి వ్రాసినవి కావు.

© మధుబాబు

ఈ పుస్తకాన్ని డిజిటల్ పబ్లిష్ చేసిన వారు :

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

# కళ్యాణ తిలకం

*(ఆఖరి భాగం)*

" మంచికో చెడుకో ఒక అడుగు ముందుకువేయటం జరిగిపోయింది. ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకంజ వేయటం కూడనిపని...." అంటూ ఇంటి ముందుకు దారితీశాడు. అతను ఊహించినట్లు పడుతూ లేస్తూ పరిగెత్తుకు రానే వచ్చింది పూటకూటి పెద్దమ్మ.

" కాంతివంతమైన వెలుగుల్ని వెదజల్లుతూ తోకచుక్క ఇక్కడ ప్రత్యక్షం అయిందని చెప్పుకుంటున్నారు... మీరు చూశారా నాయనలారా? " ఆయాసాన్ని అణుచుకునే ప్రయత్నం చేయకుండా ప్రశ్నించింది.

అటువంటి ప్రశ్న వినవలసివస్తుందని అనుకుంటూనే వున్నాడు బలదేవుడు. వెంటనే తల ఊపాడతను... అందరికీ అగుపించిన వెలుగు తమకు కూడా కనిపించినట్లు చిత్రవిచిత్రమైన వర్ణనలు జోడించి చెప్పాడు.

" తోకచుక్క రాక అరిష్టదాయకమని అందరూ అంటూ వుంటారు... మా నగరానికి ఎటువంటి కీడు వాటిల్లనున్నదో తలచుకోవటానికి భయంగా వున్నది." గద్గద కంఠంతో అంటూ ఇంటి ముందున్న మట్టి అరుగుల మీద దబ్బున కూలబడిపోయింది పెద్దమ్మ.

ఆమె ఆందోళనను తొలగించే మార్గం స్నేహితులకు అగుపించలేదు. నిజం చెపితే చిటికెలో మాయం అవుతుంది ఆందోళన.... కాని ఆ తరువాత తాము ఎదుర్కోవలసిన కష్టాలు చెప్పనలవి కావు. కూడబలుక్కున్నట్లు మౌనం వహించారు వారిద్దరూ. కొద్దిసేపటి తరువాత తనను తానే సంభాళించు కున్నది

పెద్దమ్మ.

" నగంరంలోని ఆలయాలన్నిటిలోనూ పూజలూ, పునస్కారాలు జరిపించమని యువరానికి చెపుతాను... మహారాజులవారి పేరిట, యువరాజులవారి పేరిట ప్రత్యేకమైన అర్చనలు ఆరంభింపచేయటం అన్నింటికంటే ఉత్తమం" అని తనలో తాను అనుకుంటున్నట్లు పైకే అనుకుంటూ ఇంటిలోపలికి వెళ్ళిపోయింది.

మొలకెత్తిన వరిగడ్డి పరకల్ని, చివుళ్ళు తొడిగిన గోశాల దూలాన్ని చూసిన తరువాత ఆమె ఇంకెటువంటి పలుకులు పలుకుతుందో ఊహించటానికి ప్రయత్నిస్తూ, ఆమెతోపాటు లోనికి వెళ్ళి, వెనువెంటనే పట్టెమంచంమీద మేనులు వాల్చారు స్నేహితులు ఇద్దరూ.

* * * * *

అర్ధరాత్రి సమయం దాటిపోయిన తరువాత మెలుకువగానే వున్న పూటకూటి పెద్దమ్మ, తూర్పు దిక్కున తొలివెలుగులు ప్రత్యక్షం కాకముందే నిద్రలేచి, చకచకా ఇంటిపనులు ప్రారంభించింది.

అరచేతిలో ఇమిడే నూనెదీపాన్నొకదాన్ని పశువుల పాకకు దూరంగా నిలబెట్టి, క్రిందవున్న గడ్డిపరకల్ని ఊడ్చివేస్తుండగా, ఆమె కంటపడ్డాయి మొలకెత్తిన గడ్డిపరకలు. చిగురులు తొడిగిన గోశాల దూలం కూడా కనిపించింది. పరుగుపరుగున వచ్చి స్నేహితులిద్దరనీ నిద్రలేపిందామె. వారిని చేతులు పట్టుకొని తీసుకుపోయి, ఆ విచిత్రాలను చూపించింది.

" అరిష్టాన్ని కలిగించే తోకచుక్క ఈ ప్రదేశం మీదుగా ఆవలికి పోయి వుండదు పెద్దమ్మా... ఎండిపోయిన మోళ్ళు తిరిగి చిగుళ్ళు వేయటం శుభసూచకం. రాత్రి మాకు అగుపించిన వెలుగు తోకచుక్క మూలకంగా ఉద్భవించింది అయివుండదు.

ఏ గాంధర్వులో, కింపురుషులో, మధుమావతీదేవి అందాలను చూడటం కోసం ఇటుగా వచ్చి వుంటారు" . తడుముకోకుండా అన్నాడు బలదేవుడు.

ఒక్కక్షణం నిర్ఘాంతపోయి, అంతలోనే తేరుకుని

" నువ్వు మహామాటకారివి... వట్టి మాటకారివి కాదు, మర్యాద తెలిసిన మాటకారివి. నీ మాటల్ని నా చిట్టితల్లికి తప్పకుండా వినిపిస్తాను" నవ్వుతూ అన్నది. అతని భుజం మీద ఆప్యాయపూర్వకంగా ఒక దెబ్బ వేసింది.

ఆమెను అవతలికి పొమ్మనిచెప్పి, గోశాలను శుభ్రం చేసే పనిని తను చేపట్టాడు బలదేవుడు.

" నల్లావు దగ్గిరికి పోకు నాయనా... వట్టి జగడాలమారిది అది.... చిన్నప్పటి నుంచీ పెంచి పెద్దచేసిన నన్నే పొడవటానికి చూస్తూ వుంటుంది." పెద్ద

కంఠంతో హెచ్చరించి మిగిలిన పనులు చూసుకోవటానికి వెళ్ళిపోయింది పెద్దమ్మ. అలా వెళ్ళిపోవడమే మంచిది అయింది.

ఎందుకంటే, ఆమె హెచ్చరించినట్లు, బలదేవుడిని చూసి కొమ్ముల్ని బారు చేయలేదా నల్లావు. చంటిబిడ్డమాదిరి అతని దగ్గిరికి జరిగి ఆప్యాయతను ప్రదర్శించింది. గోశాలలను, పశువుల పాకలను ఆశ్రయించుకుని బ్రతికే గామార్లు కుట్టటంవల్ల, ఎర్రటి గాయాలు రెండు ఆ గోమాత మూపురం మీద అగుపిస్తున్నాయి.

నూనెదీపపు వెలుగులో వాటిని చూసి, ' అప్పుడే చిలికిన వెన్న ఈ గాయాలను వెంటనే మాన్పుతుంది... పెద్దమ్మను అడిగి కాస్తంత తీసుకురాగలవా మిత్రమా' అని వసంతుడికి చెప్పబోయాడు బలదేవుడు.

అంతలోనే అగుపించిన దృశ్యం అతని శరీరాన్ని

ఝల్లుమనిపించింది. తలను వంచి అతని గుండెలను మృదువుగా తడుముతోంది ఆ గోవు. ఉన్నట్లుండి ప్రక్కకు తిరిగి తన మూపురాన్ని అతని దట్టీకేసి రాసింది.

దట్టీలో వున్న శిలలు గుప్పుమని సెగల్ని వెలువరించటం బలదేవుడికి తెలిసివచ్చింది. ఆ సెగలు ఆ గోవును కూడా స్పృశించి వుంటాయి. చూస్తూ వుండగానే మాయం అయిపోయాయి గోవు మూపురం మీద వున్న గాయాలు.

" ఎన్నెన్నో తరాల నుంచి ఎక్కడెక్కడో పడిపోయిన తమను తిరిగి ఒకచోటికి చేర్చే ప్రయత్నాలు సఫలీకృతం అవుతున్నాయన్న ఆనందం ఈ శిలల్ని ఆవరించుకున్నవి. తమ శక్తుల్ని ప్రదర్శించటం ప్రారంభించాయి ఇవి... సందేహపడవలసిన అవసరమే లేదు..." ఆ దృశ్యాన్ని చూసిన వసంతుడు అన్నాడు.

ఆలస్యం చేసినా, మరికొద్దిసేపు అక్కడే

నిలబడినా, దట్టీలోని శిలలు తమ సంతోషాన్ని ప్రకటించేందుకు వెలుగుల్ని ప్రసరించటం మొదలుపెడతాయన్న భయంతో, వేగంగా గోశాలను శుభ్రంచేసి, ఈవలకు వచ్చేశాడు. అవతలగావున్న బావి దగ్గిరికి పోయి వారిద్దరూ స్నానసంధ్యల్ని పూర్తిచేసుకోవటం, పూటకూటి పెద్దమ్మ వారిద్దరినీ పెద్ద కంఠంతో పిలవటం ఒకేసారి జరిగింది.

" సూర్యోదయం అయిన పిమ్మట ఘడియకాలం మా సైన్యాధ్యక్షుల వారు తమ ఇంటిదగ్గిర మీకు దర్శనం ఇస్తారు. ఆలస్యం చేస్తే మహారాజుల దర్శనార్థం వెళ్ళిపోవచ్చు... త్వరగా రండి" అంటూ చక్కని అరటి ఆకుల్లో వేడివేడిగా వున్న పాయసాన్ని వడ్డించింది.

ఆప్యాయంగా భుజించి, ఈవలకు రాబోతూ, తాము అక్కడ విడిది చేసినందుకు ప్రతిఫలం ఎంత ఇవ్వవలసి వుంటుందో తెలుసుకోగోరాడు బలదేవుడు.

" బ్రతుకు తెరువు చూసుకోవటానికి వచ్చిన మీ దగ్గిర ఇప్పుడిప్పుడే ఏమీ తీసుకోను.... రాచకొలువులో కుదురుకుని మొట్టమొదటి భృత్యం పుచ్చుకోండి. అప్పుడు తీసుకుంటాను. అంతవరకు మీరు ఇక్కడే వుండాలి" అంటూ వారిద్దరినీ సాగనంపిందా వృద్ధురాలు.

సంకీరరాజ్యంలో అల్లరిపెట్టిన పూటకూటింటి యజమానురాలి ప్రవర్తనకు, ఆమెకు గల వ్యత్యాసాన్ని గురించి మాటలాడుకుంటూ రాచవీధిలో అడుగులు వేశారు స్నేహితులు. పావుఘడియ తరువాత సైన్యాధ్యక్షులవారి భవంతి ముందు నిలబడి, అక్కడి కాపలా భటులకు తామెందుకు వచ్చారో తెలియచేశారు.

మరో పావుఘడియ గడిచిన తరువాత వారిని లోపలికి పిలిపించాడు సైన్యాధిపతి. అరువది సంవత్సరాల వయసుంటది ఆయనకు.... తెల్లగా

నెరసిన జుట్టూ, ధవళవర్ణాన్ని పొందిన గుబురు మీసాలు, అదొకరకమైన గాంభీర్యాన్ని ఆయన వదనానికి ఆపాదిస్తున్నాయి.

తన సాహస చర్యలకు బహుమతిగా మహారాజుల వద్ద నుండి పుచ్చుకున్న బంగారు కంకణాలు మృదుమధుర ధ్వనులు చేస్తుండగా, ధవళవర్ణపు మీసాలను దువ్వుకుంటూ ప్రశ్నార్ధకంగా చూశాడు.

తాము ఎందుకు వచ్చారో, ఎవరి పనుపున వచ్చారో తెలియచేశాడు బలదేవుడు. అందుకు గుర్తుగా పాపిటిచేరును చూపించమని వసంతుడికి సైగచేశాడు.

వసంతుడాపని చేయకముందే దక్షిణహస్తాన్ని పైకెత్తి అతన్ని వారించాడు సైన్యాధిపతి.

" యువరాణి మధుమావతీదేవి పూటకూటి పెద్దమ్మ ఇంటికి రావటం, మాట్లాడటం తన ఆభరణాన్ని మీకు బహూకరించటం అంతా మాకు

తెలుసు. చింతలతోపు దగ్గరి మంత్రవాది దగ్గిరికి ఆమె ఒంటరిగా పయనమౌతుంటే, అంగరక్షకుల మాదిరి మీరిద్దరూ అనుసరించి వెళ్ళటం కూడా మా దృష్టికి వచ్చింది." ఉరుము ఉరిమినట్లున్న కంఠంతో ఆయన ఆ మాటల్ని చెపుతుంటే, చలిగాలి వీచినట్లు జలదరించింది బలదేవుడి శరీరం సహస్రాక్షుడి మాదిరి నగరాన్ని కనిపెట్టుకుని వున్నాడు ఆయన... చీకటి వీధుల్లోని కదలికలన్నిటినీ పరికిస్తున్నాడు. పశువుల పాకదగ్గిర పచ్చులు ప్రకటించిన సంతోషాలను గమనించి వుంటాడా?

గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుని, ముంగాళ్ళమీగ నిలుపబడిన అతని ముఖంవంక చూసి చిన్న చిరునవ్వు నవ్వాడు సైన్యాధ్యక్షుడు.

" యువరాణి ఎడల మీరు చూపిన గౌరవం, సేవా తత్పరత మమ్మల్ని సంప్రీతుల్ని చేశాయి. మిమ్మల్ని కొలువులో చేర్చుకోవటంతో పాటు మీకు

అతిముఖ్యమైన బాధ్యతను అప్పగించదలిచాము..."

మరింత అధికం అయిపోయింది బలదేవుని మదిలోని అలజడి, కాళిక కంఠహారంలోని పచ్చల్లో మూడు తమకు లభించాయి. నాలుగవపచ్చ ఎప్పుడు ఎలా దర్శనం ఇస్తుందో తెలియని పరిస్థితి. ఆ విషయాన్ని మరిచిపోయి అతి ముఖ్యమైన బాధ్యతలను తలలమీద వేసుకుంటే తాము వచ్చిన పని నెరవేరటం ఎలా?

అతని మనస్సులోని అలజడిని అణుమాత్రంగా కూడా గమనించలేదు సైన్యాధిపతి. " రాకుమారిని దర్శించిన క్షణం నుంచీ మీరిద్దరూ మా కొలువులో కుదురుకున్నట్లే లెక్క. ఈ రోజు నుంచీ మా యువరాజు సుదంతుడికి అంగరక్షకులుగా వుంటారు. అనారోగ్యం పాలైన మా యువరాజును కంటికి రెప్ప మాదిరి కాచుకుంటారా? " చేతిని ఎత్తి ఎవరికో సైగ చేశాడు.

వెంటనే అవతలికిపోయి అరక్షణికంలో

తిరిగివచ్చాడు దూరంగా నిలబడి వున్న సేవకుడు ఒకతను. పట్టువస్త్రంలో మూటగట్టిన కొన్ని బంగారు నాణేలను తీసుకువచ్చి స్నేహితుల దోసిళ్ళలో పోశాడు.

" మీరు చేసే సేవలకు ముందుగానే ఇస్తున్న భృత్యం ఇది. విశ్వాసంతో మీ కర్తవ్యాన్ని నిర్వహించండి..." అంటూ ప్రక్కకు తిరిగి, రాజ్యాధికారులతో ఏదో మాట్లాడటంలో మునిగిపోయాడు సైన్యాధిపతి.

ఆయన తమ వంక చూడకపోయినా, తలలు వంచి అభివాదం చేశారు స్నేహితులు ఇద్దరూ. మెత్తగా అడుగులు వేస్తూ భవనం వెలుపలికి వచ్చారు.

యువరాజు సుదంతుడికి అంగరక్షకులుగా వారు నియమింపబడిన వార్త, వారికంటే ముందుగా భవనం వెలుపలవున్న వీరభటులకు తెలిసిపోయింది.

" ఇప్పటివరకూ శతసంఖ్యను మించి అంగరక్షకులు నియమింపబడ్డారా? .... అరువదిమంది

మతులుచెడి పిచ్చివాళ్ళుగా మారిపోయారు... నలుబదిమంది అసువుల్ని కోల్పోయారు... ఇప్పుడు మీకు వంతు వచ్చింది" వెక్కిరింపుగా నవ్వుతూ అన్నారు వారిలో కొందరు. సానుభూతి సూచకంగా పెదవులు విరిచారు మరికొంరు.

" ముందుగానే ఇవ్వబడిన బంగారు నాణేలను వెంటనే ఏదో ఒక పనికి వినియోగించుకోండి... వినియోగపరుచుకోకుండానే మీకు రోజులు మూడిపోవచ్చు" అన్నారు ఇంకా మరికొంతమంది.

***End of Preview.***

***Rest of the book can be read @***

***[http://kinige.com/kbook.php?id=157](http://kinige.com/kbook.php?id=157)***